ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 296 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 2 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# రూ. 50,65,345 కోట్లతో

## కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పన



### దేశమంటే మట్టి కాదోయ్..దేశమంటే మనుషులోయ్
### గురజాడ మాటలతో బడ్జెట్ ప్రసంగం చేసిన నిర్మలా సీతారామన్
### వేతన జీవులకు ఊరట కలిగిస్తూ..12 లక్షల వరకు ట్యాక్స్ ఫ్రీ
### చిన్న తరహా పరిశ్రమలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం
### రైతుల కోసం మరో కొత్త పథకం
### కోటి మంది గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా
### అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణ
### సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు
### 50 ఏళ్లకు వడ్డీ రహిత రుణాలు అందచేత
### వరుసగా ఎనిమిదవసారి బడ్జెట్ ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ప్రభాత ఉదయం):** వేతన జీవులకు ఊరట కలిగిస్తూ..చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహ మిస్తూ.. అన్నదాతలకు అండగా నిలిచేలా భరోసానిస్తూ...కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ కేంద్ర వార్షిక బడ్జెట్2025-26ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వైద్య విద్యార్థులకు తీపి కబురు అందించారు. మొత్తం రూ. 50,65,345 కోట్లతో 2025-26 ఏడాది కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా మధ్యతరగతి ప్రజానీకానికి భారీ ఊరట లభించింది. రూ.12 లక్షలలోపు ఆదాయం ఉన్నవారికి పూర్తిగా పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అలాగే రక్షణ శాఖకు అధికంగా నిధులు కేటాయించింది. లోక్‌సభలో ఎనిమిదోసారి బడ్జెట్‌ను కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టారు. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ మాటలను ఉటంకిస్తూ...బడ్జెట్ ప్రసంగం ప్రారంభించారు. వ్యవసాయం, ఎగుమతులు, పెట్టుబ డులు సహా ఆరురంగాల్లో సమూల మార్పులు చేశారు. వికసిత్ భారత్ కోసం న్యూక్లియర్ ఎనర్జీ మిషన్ తోపాటు భూ రికార్డుల డిజిటలైజేషన్‌కు బడ్జెట్ లో ప్రాధాన్యమిచ్చారు. హోమ్ స్టే కల్పించేవారికి ప్రభుత్వ రుణాలు, ఐఐటి, ఐఐఎంలో కొత్తగా 10వేల ఫెలోషిప్స్‌కుబడ్జెట్ లో నిధులు కేటాయించారు. తోలు పరిశ్రమలు, బొమ్మల రంగానికి బడ్జెట్ లో చేయూతనిచ్చారు. కొత్తగా నేషనల్ ఇనిస్టిట్యూట్ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థను ప్రారంభిస్తామన్నారు. మేకిన్ ఇండియా కోసం జాతీయస్థాయి ప్రణాళిక రూపొందిస్తు న్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో బ్రాడ్‌బ్యాండ్ సేవలకు బడ్జెట్ లో ప్రాధాన్యమిచ్చారు. సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు బ్జడెట్‌లో అదనపు నిధులు కేటాయించారు. మూలధన వ్యయానికి వడ్డీ లేకుండా లక్షలన్న రోట్లు కేటాయించారు. నగరాల అభివృద్ధి కోసం అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అంతర్రాష్ట్ర విద్యుత్ పంపిణీ కోసం కొత్త ప్రణాళిక ప్రకటించారు. దేశంలో వెనుకబడి జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహించడంతో పాటు గోదాములు, నీటి పారుదల, రుణ సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యవసాయం, ఎంఎస్‌ఎంఇ, ఎగుమతులు, పెట్టుబడులతో పాటు ఆరు రంగాల్లో సమూల మార్పులు తీసుకోస్తున్నామన్నారు. పిఎం ధన్‌ధాన్య కృషి యోజన పేరుతో కొత్త పథకం తీసుకరావడంతో పాటు 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని, 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. వలసలు అరికట్టడంపై ప్రధానంగా దృష్టి

..మిగతా 2లో

#### బీజేపీతో సీఎం రేవంత్

## చీకటి ఒప్పందం

బడ్జెట్‌లో అన్యాయం జరిగినా నిలదీయలేరు
తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెట్టిన జాతీయ పార్టీలు
బడ్జెట్ కేటాయింపులపై ఘాటుగా స్పందించిన కేటీఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ప్రభాత ఉదయం):** జాతీయ పార్టీలు ఎప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేవని మరోసారి కేంద్ర బడ్జెట్‌తో మరోసారి రుజువైందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ రెండు పార్టీల నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ఆ 16 మంది కలిసి తెలంగాణకు తెచ్చింది అక్షరాల గుండు సున్నా అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన రేవంత్ రెడ్డి బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకోవడం వల్ల ఇవాళ ఈ పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. వరుసగా రెండో ఏడాది తెలంగాణకు చిల్లి గవ్వ కూడా తీసుకురాలేకపోయిన బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఎంపీలు తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వీయ

..మిగతా 2లో


#### బడ్జెట్‌లో తెలంగాణకు

## తీవ్ర అన్యాయం

### మొత్తంగా గుండుసున్నా చుట్టిన కేంద్రం
### ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ, మూసీలకు దక్కని నిధులు
### ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే బడ్జెట్‌లో పెద్దపీట
### పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీస్తామన్న సీఎం రేవంత్

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ప్రభాత ఉదయం):** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని.. దీనిపై పార్లమెంట్లో కేంద్రాన్ని నిలదీస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బ్జడెట్‌పై మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్లో సమీక్ష నిర్వహించారు. కేంద్రం పట్టించుకోని తెలంగాణ ప్రతిపాదనలపై చర్చించారు. అనంతరం సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే బ్జడెట్లో పెద్దపీట వేశారని.. మిగిలిన రాష్ట్రాలను బడ్జెట్లో పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ ఎంపీలతో చర్చించి.. పార్లమెంట్లో కేంద్రాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. కీలక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు నిధులు ఆశించి తెలంగాణ భంగపడింది. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్, మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు, మెట్రో రైలు విస్తరణకు నిధులు ఆశించగా నిరాశే మిగిలిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం.. తెలంగాణకు దక్కాల్సిన నిధులను ప్రభుత్వం ఆశించగా కేంద్ర బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేకపోవడం గమనార్హం అన్నారు. గోదావరి నదీ జలాలకు సంబంధించి కేంద్రం ముందు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రతిపాదన ఉంచింది. హైదరాబాద్ నగరంలో తాగునీటికి రానురానూ డిమాండ్ పెరుగుతుందని, గోదావరి జలాలను తరలించడంతో పాటు మూసీ నది జలాలను శుద్ధి చేస్తే ఈ సమస్య తలెత్తకుండా ఉంటుందని కేంద్రానికి ప్రభుత్వం తెలిపింది. ఈ

..మిగతా 2లో



## మధ్య తరగతి ప్రజల డ్రీమ్ బడ్జెట్

### పేదలు, మధ్యతరగతితో పాటు ఉద్యోగులకు మేలు
### వివిధ కేటాయింపులతో తెలంగాణకు కూడా వాటా
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వివరణ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ప్రభాత ఉదయం):** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్.. మధ్య తరగతి ప్రజల డ్రీమ్ బడ్జెట్ అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ ద్వారా తెలంగాణకు జరిగే లబ్ధిని వివరించారు. 'ఈ బడ్జెట్ ఎంతో ప్రత్యేకమైంది. పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పనకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. పేదలు, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు ఎంతో మేలు చేసేదిగా ఉంది. రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇచ్చి.. మోదీ సర్కార్ ఎంతో గొప్ప నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఆదాయం కోల్పోతున్నప్పటికీ ప్రజల శ్రేయస్సు కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా వేసిన మొదటి అడుగు ఇది. కొవిడ్, ఆ తర్వాత యుద్ధాల కారణంగా చాలా దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాయి.తెలంగాణకు ఎమిచ్చారని డిబేట్‌లలో కొందరు అంటున్నారు. కేంద్రం అమలు చేసే అన్ని పథకాల్లో తెలంగాణ కూడా భాగస్వామిగా ఉంటుంది. వచ్చే ఐదేళ్లలో ఎంఎస్‌ఎంఈలకు బడ్జెట్లో రూ.1.50లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కూడా లబ్ధి చేకూరుతుంది. రాష్ట్రంలో 10లక్షలకు పైగా ఎంఎస్‌ఎంఈలు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా 27 రంగాల్లో స్టార్టప్ కంపెనీలు

..మిగతా 2లో



ఇంటర్మీడియెట్ పరీక్షలపై సంబధిత అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 1(ప్రభాత ఉదయం): మార్చి 5వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో ఇంటర్ పరీక్షలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ, మార్చి 5వ తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు చేపట్టవలసిన పనులను సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు నిర్వహణకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, డివిజన్ స్థాయిలో సంబంధిత అధికారులతో వాట్సప్ గ్రూప్ చేయాలన్నారు. ఆర్డీఓ కార్యాలయాలలో ఎగ్జామ్ సెల్ ను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా నిర్వహించాలన్నారు. జిల్లాలో 185 పరీక్షా కేంద్రాల ద్వారా 77,863 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 69,348 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఉంటాయని తెలిపారు. పోలీస్ శాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాలలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మంచినీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఏర్పాట్లు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, చేవెళ్ళ ఆర్డీఓ చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు, పోస్టల్ శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, మెడికల్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

మొదటి పేజీ తరువాయి...

అంశాన్ని కూడా కేంద్రం పట్టించుకోలేదు. రీజినల్ రింగ్‌రోడ్డుకు చేయూత, మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అడిగినా కేంద్రం ఈ ప్రతిపాదనలను పెడ చెవిన పెట్టింది. ఏటా కేంద్రం నుంచి పన్నుల వాటాతో పాటు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు, సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్‌ల నిధులు రాష్ట్రాలకు అందుతాయి. కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి రాష్ట్రాలకిచ్చే సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్ నిధులు వస్తాయి. ఇవి దేశంలోని ప్రతీ రాష్ట్రానికి కేంద్రం నుంచి అందేవే. కొత్తగా తెలంగాణకంటూ కేంద్రం బడ్జెట్‌లో చేసిన మేలు ఏం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే.. తెలంగాణకు దక్కింది గుండు సున్నా అని సిఎం రేవంత్ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో జరుగుతోంది. రాష్ట్ర కేంద్ర బ్జడెట్, రాష్ట్ర ప్రతిపాదనలు, తదితర అంశాలపై సీఎం సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, ఇతర రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. రాష్ట్ర బ్జడెట్ 2025-26కి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ÷నాన్స్ డిపార్ట్ మెంట్‌కు చేరుకున్నాయి. అందులో భాగంగా ప్రతి శాఖ తమకు అవసరమైన నిధులను డిమాండ్ చేసినట్లు సమాచారం. బడ్జెట్‌లో తెలంగాణకు సంబంధించి ప్రధానమైన అంశాలను, రాష్ట్రం గమనించాల్సిన ప్రతిపాదనలు, అలాగే గడచిన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక ప్రణాళికలను సమీక్షించారు. దీంతోపాటు రాష్ట్ర మంత్రుల జాబితా, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్య, రవాణా, వ్యవసాయం వంటి పలు రంగాలపై దృష్టిపెట్టి చర్చలు జరిపారు. ఈ సమావేశం అనంతరం, మంత్రులు తమ శాఖల సమస్యలను ప్రభుత్వానికి సమర్పించడానికి సిద్ధమవుతారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఇక్కడ చర్చించిన ప్రతిపాదనలు, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపుల కోసం మంత్రులు అవసరమైన సూచనలను అందిస్తారు. ఈ సమావేశం రాష్ట్ర ఆర్థిక వ్యూహాన్ని మెరుగుపరచడానికి కీలకమైనదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్యలపై చర్చ ఏదీ

### పదేల్లుగా పన్నుల రూపంలో రూ.54.18 లక్షల కోట్ల దోపిడీ

### బడ్జెట్ తీరుపై ఎక్స్ వేదికగా మండిపడ్డ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ప్రభాత ఉదయం):** యావత్ దేశం ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్యలతో బాధపడుతుంటే.. ప్రభుత్వం మాత్రం కేంద్ర బడ్జెట్‌ను ప్రశంసించే పనిలో బిజీగా ఉందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ బ్జడెట్ ప్రజలను మోసం చేసేలా ఉందని వ్యాఖ్యానించారు. భాజపా తీరు 'అనేక పాపాలు చేసిన తర్వాత.. భక్తి మార్గంలో నడవాలనుకుంటున్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. 'గత పదేళ్లల్లో మధ్యతరగతి ప్రజల నుంచి నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ.54.18 లక్షల కోట్ల మొత్తాన్ని పన్నుల రూపంలో వసూలు చేసింది. ఇప్పుడు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చింది. కేంద్రం తాజాగా తీసుకున్న నిర్ణయంతో సగటున ఏడాదికి రూ.80 వేలు ఆదా చేసుకోవచ్చని చెబుతున్నారు. దేశం మొత్తం ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో పోరాడుతుంటే.. మోదీ ప్రభుత్వం మాత్రం ప్రశంసల కోసం తాపత్రయ పడుతోందని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'ఈ బడ్జెట్‌లో యువత ప్రస్తావనే లేదని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తామని చెప్పిన మోదీ.. వాళ్లకు కూడా మొండి చేయి చూపించారని ఖర్గే విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం.. ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. 'దళితులు, మైనార్టీలు, వెనుకబడిన వర్గాల వారి పిల్లలకు విద్య, ఆరోగ్యంపై ఎలాంటి ప్రకటన లేదు. ప్రైవేటు పెట్టుబడుల్ని పెంచేందు ఎలాంటి చర్యలు లేవు. ఎగుమతులు, పన్ను శ్లాబుల వివరాలను హైలెట్ చేయడం ద్వారా తమ వైఫల్యాలను కేంద్రం ప్రభుత్వం కప్పిపుచ్చే ప్రయత్నం చేసింది' అని ఖర్గే విమర్శించారు. కేంద్ర బడ్జెపై ఆర్థికశాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం స్పందించారు. చాలా పథకాలు ప్రభుత్వ సామర్థ్యానికి మించి ఉన్నాయని వ్యాఖ్యానించారు. ' తాజా బ్జడెట్‌లో కొత్త పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విరివిగా చేర్చారు. కానీ, అందులో చాలా పథకాలు ప్రభుత్వ సామర్థ్యాన్ని మించి ఉన్నాయి' అని చిదంబరం మీడియాతో అన్నారు. 'పన్ను చెల్లించే మధ్య తరగతి ప్రజలను, బిహార్ ఓటర్లను బ్జడెట్ ఆకర్షించింది. ఈ బ్జడెట్‌తో ఉద్యోగులు సంతోషంగా ఉంటారు. ప్రజా కార్యకలాపాల నిర్వహణ కష్టతరమవుతుంది' అని చిదంబరం పేర్కొన్నారు. చిదంబరం గతంలో పలుమార్లు ఆర్థిక మంత్రిగా సేవలందించిన విషయం తెలిసిందే.

# రూ. 50,65,345 కోట్లతో

## కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పన

మొదటి పేజీ తరువాయి...



పెడుతున్నామని స్పష్టం చేశారు. బిహార్‌లో మకానా బోర్డు ఏర్పాటు చేస్తున్నామని, కిసాన్ క్రెడిట్ కార్డ్ పరిమితి పెంపు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నామని, పత్తి ఉత్పాదకత పెంచేందుకు స్పెషల్ మిషన్ ఏర్పాటు చేశామని, పప్పు ధాన్యాల ఉత్పత్తికి స్వయం సమృద్ధి పథకం ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ రంగానికి కొత్త జవసత్వాలు నింపడంతో పాటు ఎంఎస్ఎంఇ లకు బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అధిక వృద్ధి రేటు సాధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి అని నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. సున్నా శాతం పేదరికమే మా లక్ష్యమని, వికాస్ భారత్‌లో వంద శాతం క్వాలిటీ విద్య ఉంటుందని, 2024-25లో ఎకానమీ వృద్ధి అంచనా 6.4 శాతం, 2025-26కు అంచనా 6.3-6.8 శాతానికి తీసుకెళ్తామన్నారు. సబ్ కా వికాస్‌కు వచ్చే ఐదేళ్లు సువర్ణవకాశం ఉంటుందన్నారు. మేం చేపట్టిన సంస్కరణలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశాలుగా మారాయని, ఆరు రంగాల్లో సమూల మార్పులు చేస్తామని, 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం ఉంటుందని, ఇన్‌ఫ్రా, మధ్యతరగతి ప్రజల వికాసమే లక్ష్యంగా ఐదేళ్ల ప్రణాళిక ఉంటుందని, పప్పుధాన్యాల కోసం ఆరు సంవత్సరాల ప్రణాళిక ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. లాజిస్టిక్ వ్యవస్థగా ఇండియన్ పోస్ట్, పోస్టల్ శాఖకు కొత్త రూపు ఇచ్చేలా ప్రణాళిక, ఈశాన్య రాష్ట్రాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు ప్రోత్సాహం, నేషనల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులు దిద్దామని, అన్ని ప్రభుత్వ స్కూల్స్ కు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్నామని, పదేళ్లలో ఐఐటిల్లో విద్యార్థుల సంఖ్య రెట్టింపుగా మారిందని, ఐఐటి పాట్నా విస్తరణకు నిర్ణయం తీసుకున్నామని, విద్యారంగంలో ఎఐ వినియోగం తీసుకొస్తున్నామని, ఐదేళ్లలో అదనంగా 75 వేల మెడికల్ సీట్లు ఏర్పాటు చేశామని, బిహార్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఏర్పాటు చేయడంతో రూ.30 వేలతో స్ట్రీట్ వెంటర్స్‌కు క్రెడిట్ కార్డులు ఇచ్చామని, బొమ్మల తయారీకి ప్రత్యేక పథకం రూపొందించామన్నారు. అన్ని జిల్లా ఆస్పత్రుల్లో డే-కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు కోటి మంది గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా, 50 వేల ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ శిక్షణ కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సంస్కరణలు అమలు చేసే రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు 50 ఏళ్లకు వడ్డీ రహిత రుణాలు ఇస్తామని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు.

ఈ క్రమంలో వివిధ శాఖలకు కేటాయింపులు ఇలావున్నాయి. రక్షణ రూ. 4,91,732 కోట్లు, గ్రామీణాభివృద్ధి రూ. 2,66,817 కోట్లు,హోం రూ. 2,33,211 కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగానికి రూ. 1,71,437 కోట్లు, విద్య రూ. 1,28,650 కోట్లు,ఆరోగ్య రూ. 98,311 కోట్లు, పట్టణాభివృద్ధి రూ. 96,777 కోట్లు, ఐటి, టెలికం రూ. 95,298 కోట్లు, విద్యుత్ రూ. 81,174 కోట్లు, వాణిజ్య, పరిశ్రమలు రూ. 65,553 కోట్లు, సామాజిక సంక్షేమం రూ. 60,052కోట్లు, వైజ్ఞానికి విభాగాలకు రూ. 55,679 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆదాయపన్ను నుంచి 22 శాతం, కేంద్ర ఎక్సైజ్ నుంచి 5 శాతం, జిఎస్టి, ఇతర పన్నుల నుంచి 18 శాతం, కార్పొరేషన్ పన్ను ద్వారా 17 శాతం కస్టమ్స్ ద్వారా... 4 శాతం, అప్పులతో కాని క్యాపిటల్ రిసిప్ట్స్ ద్వారా 1 శాతం, పన్నేతర ఆదాయం 9 శాతం, అప్పులు, ఇతర మార్గాల ద్వారా 24 శాతం ఆదాయం సమకూరుతుందని వివరించారు. వడ్డీ చెల్లింపులకు 20 శాతం,కేంద్ర ప్రభుత్వ పథకాలకు 16 శాతం,కీలక సబ్సిడీలకు 6 శాతం,రక్షణ రంగానికి 8 శాతం, రాష్ట్రాలకు పన్నులు, డ్యూటీల ద్వారా చెల్లింపుల్లో 22 శాతం, ఫైనాన్స్ కమిషన్, ఇతర బదిలీల ద్వారా 8 శాతం, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు 8 శాతం, ఇతర ఖర్చులకు 8 శాతం, పెన్షన్స్‌లకు 4 శాతం ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. దాదాపు 140 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తును నిర్దేశిరచే ఈ కేంద్ర పద్దును ఆమె ప్రవేశపెట్టడం ఇది ఎనిమిదోసారి. తద్వారా ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మహిళా మంత్రిగా అరుదైన ఘనత సాధించారు. అత్యధికసార్లు బడ్జెట్లను ప్రవేశపెట్టిన రికార్డు మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ పేరిట ఉంది. ఆయన 10 పద్దులను పార్లమెంట్‌కు సమర్పించారు. ఆ తర్వాత పి.చిదంబరం, ప్రణబ్‌ముఖర్జీ వంటి వారున్నారు. నిర్మలా సీతారామన్ క్రమంగా వారి రికార్డులకు చేరువవుతున్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో వరుసగా అత్యధిక బ్జడెట్‌లను ప్రవేశపెట్టిన రికార్డును నిర్మలమ్మ కొనసాగిస్తున్నారు. ఎక్కువసార్లు పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మహిళామంత్రి గానే కాకుండా.. అత్యధిక సమయం బడ్జెట్ ప్రసంగం చేసిన రికార్డు కూడా నిర్మలమ్మ ఖాతాలోనే ఉంది. 2020-21లో బడ్జెట్ ప్రవేశపెడుతూ 162 నిమిషాల పాటు ప్రసంగించారామె. అయితే ఒంట్లో నలతగా ఉండడంతో మరో రెండు పేజీలు మిగిలిఉండగానే ప్రసంగాన్ని ముగించారు. దీంతో బడ్జెట్ చరిత్రలో ఇదే ఇప్పటివరకు సుదీర్ఘ ప్రసంగంగా కొనసాగుతోంది. అంతకంటే ముందు 2019-20 బడ్జెట్లో భాగంగా 137 నిమిషాల పాటు ఆమె చేసిన ప్రసంగం నిడివిపరంగా రెండో అతిపెద్దది. అంతకుముందు 2003-04బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన జశ్వంత్‌సింగ్ 135 నిమిషాల పాటు మాట్లాడారు. 2024-25 బడ్జెట్ ప్రసంగంలో పెద్ద పద్దును 86 నిమిషాల్లో (1 గంట 26 నిమిషాలు) ప్రవేశపెట్టారు. ఆమె బడ్జెట్ ప్రసంగాల్లో అదే అతి చిన్నది. కాగా నేడు ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో 74 నిమిషాల పాటు ప్రసంగించారు.

## ఇదో దివాళాకోరు బడ్జెట్

### బుల్లెట్ గాయానికి బ్యాండేజీ వేసినట్లుంది.. బడ్జెట్‌పై ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ప్రభాత ఉదయం):** బుల్లెట్ గాయాలకు బ్యాండ్-ఎయిడ్ చికిత్స లాంటిదని బడ్జెట్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల గాంధీ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటివేళ దేశ ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఒక నమూనా మార్పు అవసరం ఉంది. కానీ, ఈ విషయంలో కేంద్రప్రభుత్వం వద్ద ఆలోచనలు కరవయ్యాయి. ఈ బడ్జెట్ బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ చికిత్స లాంటిది' అంటూ రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌పై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈసారి కూడా పేదలు, సామాన్యులకు ఎందులోనూ ఊపశమనం కల్పించలేదన్నాయి. తమ కూటమి అధికారంలో ఉన్నందున బిహార్‌పై అధికంగా వరాలు కురిపించిందని విమర్శించాయి. ఇది కేవలం రాష్ట్రంలో ఎన్నికల సమయం సమీపిస్తున్నందున కేంద్రంలోని భాజపా పన్నుతున్న కుట్రేనంటూ ఆరోపించాయి. మరోవైపు, ఈ బ్జడెట్‌పై ప్రధాని మోదీ సహా భాజపా నేతలంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇది సామాన్యుల బడ్జెట్ అంటూ ఆర్థిక మంత్రి నిర్మలమ్మను కొనియాడారు. పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బ్జడెట్-2025 పై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ విమర్శిస్తూ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి సమయంలో దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉన్నదని, కానీ ప్రభుత్వం దివాళా కోరు ఆలోచనలు చేస్తున్నదని ఆయన మండిపడ్డారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం

### ఎన్‌డిఎ భాగస్వామ్య రాష్ట్రాలకే ప్రాధాన్యం

### మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ప్రభాత ఉదయం):** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బడ్జెట్ కేటాయింపులన్నీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలు, ఎన్‌డీయే భాగస్వామ్య రాష్ట్రాలకే దక్కాయన్నారు. కేంద్ర జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉన్నప్పటికీ ఆమేరకు కూడా నిధులు కేటాయించలేదని అసహనం వ్యక్తం చేశారు. 'రాష్ట్రం నుంచి పన్నులు రూపంలో రూ.26 వేల కోట్లు కేంద్రానికి వెళ్లాయి. గతంలో కంటే 12 శాతం మేర పెరిగినా రాజకీయ కారణాలతో తెలంగాణపై చిన్నచూపు చూశారు. భాజపాకు 8 మంది ఎంపీలను ఇచ్చినా తెలంగాణ ప్రజలకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందని అన్నారు. బిహార్, దిల్లీ, ఏపీ, గుజరాత్ లకు ప్రాధాన్యత ఇవ్వడం కక్ష సాధింపు కాదా? సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలుమార్లు ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులను కలిసి సహాయం కోసం అభ్యర్థించారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టు విస్తరణకు కేంద్రం వాటాగా రూ.17,212 కోట్లు కేటాయించాలని కోరినా రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతోన్న హైదరాబాద్, శివారు మున్సిపాలిటీలకు సీఎస్‌ఎంపీ కింద భూగర్భ డ్రైనేజీకి నిధులు కేటాయించాలని విన్నవించుకున్నా బ్జడెట్‌లో కేటాయింపులు చేయకుండా అన్యాయం చేశారు' అని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## దండకారణ్యంలో మరోమారు కాల్పులు

### ఎన్‌కౌంటర్‌లో 8మంది మావోల హతం



**రాయపూర్, ఫిబ్రవరి 1 (ప్రభాత ఉదయం):** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్ జిల్లా గంగలూర్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 8 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పశ్చిమ బస్తర్ డివిజన్ మావోయిస్టులు నక్కినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో.. డీఆర్‌జీ, సీఆర్పీఎఫ్, కోబ్రా యూనిట్, ఎస్‌టీఎఫ్ బలగాలు యాంటీ నక్సలైట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలను చూసిన మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో సిబ్బంది ఎదురుకాల్పులు జరిపి మావోయిస్టులను హతమార్చారు. ఉదయం 8.30 గంటలకు మొదలైన ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. అడవుల్లో మావోయిస్టుల కోసం గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలంలో ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

## బీజేపీతో సిఎం రేవంత్ చీకటి ఒప్పందం

మొదటి పేజీ తరువాయి...

రాజకీయ అస్తిత్వమైన బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ హక్కులను, జాతి ప్రయోజనాలను కాపాడగలుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ సార్ చెప్పిన మాట ఈ రోజు మరోసారి గుర్తుకు వస్తుందన్నారు. లోక్ సభలో తెలంగాణ పార్టీ అయినా బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకుంటే జరిగే నష్టం ఏమిటో ప్రజల గమనిస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో ప్రాంతీయ పార్టీలకు బలమున్న బిహార్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు దక్కిన ప్రాధాన్యం చూసి జాతీయ పార్టీలను గెలిపిస్తే తెలంగాణను నిండా ముంచారని ప్రజలకు అర్థం అయ్యిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 30 సార్లు ఢిల్లీకి పోయింది తెలంగాణకు నిధులు తెచ్చేందుకు కాదని, తెలంగాణ నుంచి ఢీల్లీకి మూటలు మోసేందుకేనని ఈ రోజు తెలిపోయిందన్నారు. కాంగ్రెస్ సీఎంగా ఉంటూ బీజేపీకి గులాంగిరీ చేస్తూన్న బడే భాయ్- చోటే భాయ్ అనుబంధంతో తెలంగాణకు నయాపైసా లాభం లేదని తేలిపోయిందన్నారు. తెలంగాణ నుంచి మరో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు గెలిచినా.. వారితో కూడా రాష్ట్రానికి దక్కింది గుండు సున్నానే అన్నారు. కేవలం ఢిల్లీ బాసులను ప్రసన్నం చేసుకునే పని తప్ప.. ఏనాడూ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించిన పాపాన పోలేదన్నారు. కేంద్ర బ్జడెట్‌కు తెలంగాణకు రావాల్సిన వాటా గురించి పోరాడిన దాఖలు లేకపోవడం వల్లనే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కేటీఆర్ మండిపడ్డారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణకు నిధులు తేస్తామంటూ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ గెలిచినా, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు ఒక్క నయా పైసా తీసుకురాలేకపోయారన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు తమ రాష్ట్రాలకు నిధుల వరద పారిస్తుంటే.. తెలంగాణ బీజేపీ ఎంపీలు, నిస్సహాయ మంత్రులు చేతకాని దద్దమ్మల్లా వ్యవహరిస్తున్నారు. తెలంగాణకు నిధులు తేలేని బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## మధ్య తరగతి ప్రజల డ్రీమ్ బడ్జెట్

మొదటి పేజీ తరువాయి...

ఉన్నాయి. వీటి కోసం రూ.10వేల కోట్లతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీని ద్వారా తెలంగాణలో ఉన్న స్టార్టప్ కంపెనీలకు లబ్ధి చేకూరుతుంది. 50 ఏళ్ల వరకు వడ్డీ రహిత రుణాలతో తెలంగాణకు కూడా లబ్ది కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఏ సంస్కరణలు తీసుకొచ్చినా.. దాని లబ్ది తెలంగాణకి, ప్రజలకు ఉంటుంది. ఇప్పటికే అమలవుతోన్న కేంద్ర ప్రభుత్వ పథకాల పరిధిని, నిధుల వాటాను కూడా బడ్జెట్లో పెంచారు. అర్బన్ స్టేట్‌గా ఉన్న తెలంగాణకు రూ.10వేల కోట్లు రాబోతున్నాయి. రాష్ట్రంలో ఉన్న 125 అర్బన్ లోకల్ బాడీస్‌కు అమృత్ పథకం ద్వారా లబ్ది చేకూరుతుంది. స్వనిధి పథకం కింద రాష్ట్రంలో ఉన్న స్ట్రీట్ వెండర్స్‌కు లబ్ధి చేకూరుతుంది. ఇప్పటికే ఈ పథకం కింద రాష్ట్రంలో 7.5లక్షల మంది లబ్ది పొందారు. గిగ్ వర్కర్లకు ఐడీ కార్డులు, పీఎం జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా కల్పిస్తామని బ్జడెట్‌లో కేంద్రం ప్రకటించింది. దీని ద్వారా రాష్ట్రంలో ఉన్న గిగ్ వర్కర్స్‌కు ఎంతో మేలు జరుగతుంది' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## దుర్గానగర్ నుంచి పల్లెచెరువు వరకు

# ఫుట్ పాత్ అక్రమణల తొలగింపు





దుర్గా నగర్ నుంచి పల్లె చెరువు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించిన రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది

బుద్వేల్, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం) : దుర్గానగర్ నుంచి మైలార్దేవుపల్లి, ఉడంగడ్డ మీదుగా బండ్లగూడ కు వెళ్లే మార్గంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి వరకు రోడ్డు కిరువైపుల ఉన్న 160 ఫుట్ పాత్ అక్రమణలను శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. జీహెచ్ఎంసీ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ టి.వెంకన్న ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ మహేందర్ , సిబ్బందితో కలసి కూల్చివేతల పనులలో పాల్గొన్నారు. మైలార్దేవుపల్లి పోలీసులతో పాటు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ మీదుగా చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే రహదారి చాలా రద్దీగా ఉం టుందని, రోడ్డు వరకు ఫుట్పాత్ అక్రమణలు రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ లు తెలిపారు. అందులో బాగంగానే ఆక్రమణలన్నింటిని తొలగించడం జరిగిం దన్నారు. కొన్ని చోట్ల ఉన్న డబ్బాలను దుకాణదారులు అద్దె కూడ తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.



## నేడు కాటేదాన్, గగన్ పహాడ్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 1(ప్రభాత ఉదయం) గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన త్రిష మెటల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్వీసింగ్ గల్లి ప్రాంతం, శివాజీ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రవి ఫుడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన రవి ఫుడ్ పారిశ్రమ, రామ్ చరణ్ ఆయిల్ మిల్, సిటిజన్ కంట విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాటేదాన్ విద్యుత్ ఫీడర్, గంగోత్రి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన టీఎన్జీవోస్ కాలనీ అమ్మ గార్డెన్ మార్కెట్ ప్రాంతాలు, శాతం రాయి పారిశ్రామిక వాడ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**కాటేదాన్ లో...**

కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పుస్తీ ఫుడ్స్, చింటూ ఫుడ్, సాగర్ గుట్కా, చావుల ఫుడ్స్, భగవతి దాల్మిల్, ఏఎంసీ ప్లాస్టిక్, కాటేదాన్ పారిశ్రామిక వాడ, సిటిజన్ కాంత, వికాస్ ఫుడ్, డూకీస్, వివి ఎల్ ఫర్నిచర్, చతాయే కంపెనీ, కాటేదాన్ పారిశ్రామిక వాడ, గంగోత్రి విద్యుత్ ఫిల్టర్ పరిధిలో గల ప్రాంతాలైన గణేష్ నగర్, అమ్మ గార్డెన్, పైనీరు స్కూల్, బాబా టెంట్ హౌస్ షమా టెంట్ హౌస్, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం): కాటేదాన్ సబ్ స్టేషన్ -1 ఫీడర్ -3 పరిధిలో కరెం టు మరమ్మత్తుల కారణంగా ఈ నెల 2వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మద్యాహ్నం ఒంటి గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబదింత విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పుష్టి ఫుడ్స్ చింటు ఫుడ్స్, సాగర్ గుట్కా చావ్లా ఫుడ్స్, భగవత్ దాల్ మిల్, ఏఎంసీ ప్లాస్టిక్స్, కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియాలతో పాటు సిటిజెన్ కాం టా, వికాస్ ఫుడ్స్, డ్యాక్స్, వీఎంఎల్ ఫర్నిచర్, వివిఎల్ ఫర్నిచర్, చాతయే కంపెనీ, లతో పాటు గణేశ్నగర్, అమ్మ గార్డెన్, పయనీర్ స్కూల్, బాబా టెంట్ హౌజ్, షమా టెంట్ హౌజ్ ప్రాం తాలలో కరెంటు ఉండదన్నారు.




కాటేదాన్- ఓల్డ్ కర్నూల్ రోడ్డు లో పాడైన రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు.. బోల్తా పడిన ఆటో

## రోడ్డును బాగు చేయాలని స్థానికులతో కలసి సీపీఎం నాయకులు నిరసన

బుద్వేల్, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం) : కాటేదాన్ నుంచి ఓల్డ్ కర్నూల్ రోడ్డు వరకు గల రహదారి పూర్తిగా పాడై కంకర తేలిందని సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జె.రు ద్రకుమార్ వాపోయారు. ఇదే అంశాన్ని రెండు రోజుల క్రితం సీపీఎం నాయకుడు భాస్కర్ ఫోన్ ద్వారా రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ కు ఫిర్యాదు చేయగా ఆయన నిర్లక్ష్యంగా మాట్లాడారని రుద్రకుమార్ అన్నారు. పాడైన రోడ్డులో శనివారం సామాగ్రి తీసుకువెళుతున్న ఓ ఆటో ట్రాలీ పడిపోయి డ్రైవరకు గాయాలైనాయన్నారు. రోడ్డును బాగు చేయాలని స్థానికులతో కలసి సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేయడం జరిగిందని తెలి పారు. స్థానిక పరిశ్రమలు బస్తీల నుంచి వచ్చే మురుగునీరు, వాడుకునే నీరు రోడమీదికి రావడం వల్ల రోడ్డు పూర్తిగా పాడైపోయిందన్నారు. ఆస్తి పన్ను వసూలు చేసుకుంటున్న అధికారులు రోడ్డు వేయరా అంటు ప్రశ్నించారు. పేద ప్రజలు నివసించే ప్రాంతాలపై అధికారులకు పట్టదా అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు జీ కురుమయ్య, జి గటయ్య, పీసీకే భాస్కర్, నర్సింహ్మా, లక్ష్మణ్, శేఖర్, మల్లేశ్, రమేశ్, ఈశ్వర్, నరహరి, ఇబ్రహీమ్, సచ్చిన్, దత్తు, ప్రవీణ్, జహంగీర్, యూసుఫ్, అలీ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీ పీఆర్) ప్రధాన కార్యాలయం

## 2025-26 కేంద్ర బడ్జెట్‌లో ఎన్ఐఆర్డీపీఆర్‌కు గుండు సున్న

**గత సంవత్సరం రూ.73 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం**

బుద్వేల్, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం) : 2025-26 కేంద్ర బడ్జెట్ లో రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీపీఆర్) కు నిధులు కేటాయించక పోవడంతో ఆ సంస్థ ఉద్యోగులు ఆందోళనకు గురౌతున్నారు. 2024-25 వార్షిక బడ్జెట్ లో తాము పనిచేస్తున్న సంస్థ కు రూ.73 కోట్లు కేటాచించగా ఈ సంవత్సరం బడ్జెట్ కేటాయింపులో గుండు సున్న గా ఉండటంతో తమ పరిస్థితి ఏంటని ఆ సంస్థ అకాడమిక్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే అంశాన్ని మీడియా ముందు పెడుతు లేఖ రాశారు. ఈ నిర్ణయం సంస్థలో పనిచేస్తున్న 222 మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు, మూడు వందల మందికి పైగా పెన్షనర్లు వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ నిర్ణయం పై కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పునరాలోచించి ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ కు నిధులు కేటాయించాలన్నారు. తమది భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ క్రింద పనిచేస్తున్న స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అన్నారు. గౌహతీ, వైశాలి, న్యూఢిలీ లలో ప్రాంతీయ కేంద్రాలతో పాటు హైదరాబాద్ రాజేంద్రనగర్ లో ప్రధాన కార్యాలయం ఉందని అన్నారు . స్వాతంత్ర్యం వచ్చిన తొలి దినాలలో స్థాపించిన ఈ సంస్థ ద్వారా 65 సంవత్సరాలుగా గ్రామీణాభివృద్ధికి సంబందించిన శిక్షణ, సామర్థ్యం, నిర్మాణం లాంటి కార్యక్రమాలను కొనసాగించడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి సం స్థ తోడ్పాటునందిస్తు వచ్చిందన్నారు. గ్రామీణాభివృద్ధి విధానాలను రూపొందించడంలో పం చాయతీరాజ్ సంస్థ ల ప్రజాస్వామ్య వికేంద్రీకరణను బలోపేతం చేయడంలో 29 రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు, దేశంలోని మరో 90 ఎ కేంద్రాల భాగస్వామ్యంతో శిక్షణ కార్యక్రమాలను చేపడుతు వస్తుందన్నారు . తమకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఎన్ఐఆరేపీఆర్ ఉద్యోగులు కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నారు. అందులో బాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లను కలిసి తమ బాధలు చెప్పుకోవాలని ఆలోచన చేస్తున్నారు.



# కేంద్ర బడ్జెట్ బాగుంది


డాక్టర్ విద్యా సాగర్


కె. రవి కుమార్


డాక్టర్ జె సురేష్


ఎన్ మల్లారెడ్డి


ఎం కొమురయ్య

బుద్వేల్, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం) : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం. ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి, సగటు ఉద్యోగులకు బాగానే ఉందని ఆయా రంగాలలో పని చేస్తున్న వారు అంటున్నారు. వారి మాటలలో..

**ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ద్వారా మేలు : డాక్టర్ బి.విద్యాసాగర్, తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ అద్యక్షులు**

ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ద్వారా వ్యవసాయపరంగా వెనుకబడిన 100 జిల్లాలను ఎంపిక చేసి వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం చాలా బాగుంది. దీని ద్వారా 1.7 కోట్ల మంది రైతులకు లాభం చేకూరుతుంది. ఆచరణలో ఎలా ఉండబోతుంది అనే విషయంపై స్పష్టత లేకున్నప్పటికీ ప్రయోగాత్మకంగా కొంత వ్యవసాయ అభివృద్ధికి కట్టుబడే పథకం అని తెలుస్తుంది. పప్పు గింజల ఉత్పత్తి కోసం ఒక ప్రత్యేక స్కీం ను కూడా ప్రవేశపెట్టింది. ఇది భారతదేశాన్ని పప్పు గింజలలో స్వయం సమృద్ధి సాదించడానికి ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. మన దేశంలో పప్పు దినుసులు. నూనె గిం జల ఉప్పత్తి చాలా తక్కువగా ఉంది. ఈ పథకం ఆ రెండు ఉత్పత్తుల ను పెంచుకోవడానికి ఉపయోగంగా ఉంటుంది. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ. 3లక్షల నుంచి రూ. 5లక్షల కు పెంచడం రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

**రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వడం సంతోషకరం : కె. రవి కుమార్, డిప్యూటీ కమిషనర్, రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం**

చిరు ఉద్యోగులకు ఊరట కలిగించే విధంగా కేంద్ర బడ్జెట్ లో సంవత్సరానికి రూ. 12లక్షల ఆదాయం ఉన్న వారికి ఆదాయపన్ను లో మినహాయింపు లు ఇచ్చారు. ఇది చాలా సం తోషకరమైన విషయం. చాలా కాలంగా ఈ డిమాండ్ ఉ న్నప్పటికి 2025-26 బడ్జెట్ లో ఈ రాయి తీని ఇవ్వడం బాగుంది.

**మిషన్ ఆన్ హై ఈల్డ్ సీడ్ మిషన్ పథకం ద్వారా ఉపయోగాలు: డాక్టర్ జె.సురేశ్, అద్యాపకులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం**

విత్తనరంగం బలోపేతానికి అధిక దిగుబడులనిచ్చే వంగడాలను రూపోందించడానికి మిషన్ ఆన్ హై ఈల్డ్ సీడ్ మిషన్ ను ఏర్పాటు చేయనుండటం సంతోషకరం. ఈ పథకం ద్వారా వాతావరణ మార్పులు, కొత్త కొత్త పురుగులను తట్టుకునే 100 రకాల విత్తనాలను 2024లో కనుగొన్నారు. వాటిని రైతులకు చేరవేయడానికి ఉపయోగపడుతుంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘ కోస్తా తీరం ఉంది. ఆ ప్రాంతాన్ని స్పెషల్ ఎకనామిక్ జోన్ గా చేసి సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి రూ.6వేల కోట్లు ఖర్చు చేయనుండటం శుభ పరిణామం. నేషనల్ మిషన్ ఆన్ ఈడబుల్ ఆయిల్ స్కీం ద్వారా నూనె గింజల ఉత్పత్తులలో స్వయం సమృద్ధి సాదించడానికి చర్యలు తీసుకోనున్నారు. నూనె గింజల దిగుమతుల కోసం ప్రతి ఏటా 60 నుంచి 70వేల కోట్లను ఖర్చు చేస్తున్నాం. ఈ పథకం పూర్తి స్థాయిలో అమలు జరిగితే నూనె గింజల దిగుమతులను ఆపివేసి స్వయం సమృద్ధి సాదించుకోవచ్చు.

**దేశ గతిని మార్చే అద్భుతమైన బడ్జెట్: నారగూడెం మల్లారెడ్డి, బీజేపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కన్వీనర్:**

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్ గా ఉంది. రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు విప్లవాత్మకం. తెలంగాణ తో పాటు దేశంలోని ఒక్కోక్క ఉద్యోగికి రూ.80 వేల వరకు ఆదా అవుతుంది. తెలంగాణ లోని 50లక్షల మందికి పైగా రైతులు రూ. 5 లక్షల వరకు రుణం పొందే విధంగా కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని పెంచడం సంతోషకరం.

**కేంద్ర బడ్జెట్ లో అన్ని రంగాలకు ప్రాధాన్యం : ఎం కొమురయ్య, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి:**

కేంద్ర బడ్జెట్ లో అన్ని రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టింది. దేశంలో ఉడాన్ పథకం ద్వారా 120 విమానాశ్రయాల ఏర్పాటుకు నిధులు కేటాయించడం సంతోషకరాం. దేశంలో 50 పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి బడ్జెట్ లో ఆమోదం తెలిపారు. 75 వేల మెడికల్ సీట్లు నూతనంగా కేటాయించడం సంతోషకరాం. 36 ఔషధాల దిగుమతి పై సుంకాన్ని తగ్గించారని గుర్తు చేశారు. భవిష్యత్తు ఆహార భద్రత అవసరాల కోసం రెండు జన్యు బ్యాంకులను ఏర్పాటు చేయడం సంతోషకరం. ఎనిమిది కోట్ల మంది చిన్నారులకు, బాలింతలకు మేలు చేసే విధంగా అంగన్వాడీలను అభివృద్ధి చేయనున్నారు. ఇలా కేంద్ర బడ్జెట్ ప్రజలకు ఎంతో ఉపయోగపడేదిగా ఉంది.




వీధి కుక్కలను పట్టుకెళ్ళిన జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం సిబ్బంది

## గోల్డెన్ హైట్స్ కాలనీలో వీధి కుక్కలను పట్టుకెళ్లిన వెటర్నరీ విభాగం సిబ్బంది

బుద్వేల్, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ గోల్డెన్ హైట్స్ కాలనీ, హప్పీహోమ్స్ కాలనీ పరిసర కాలనీలలో శనివారం గ్రేటర్ వెటర్నరీ విభాగం సిబ్బంది వీధి కుక్కలను పట్టుకెళ్లారు. డాక్టర్ శ్రీకాంత్ ఆద్వర్యంలో సిబ్బంది వీధి కుక్కలను పట్టుకెళ్లారు. వీధి కుక్కల దాడిలో గాయపడ్డ సువాసినీ కుటుంబ సభ్యులను కలసి డాక్టర్ శ్రీకాంత్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు గోల్డెన్ హైట్స్ కాలనీలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## అభివృద్ధి పనుల పరిశీలన

బుద్వేల్, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం): మైలార్దేవుపల్లి డివిజన్ లక్ష్మీగూడ వాంబే కాలనీలో శనివారం స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు వీధి దీపాలు వెలుగడం లేదని, పారిశుధ్య నిర్వాహణ సిబ్బంది రావడం లేదని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన స్థానిక అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం లో ఎలాంటి ఇబ్బం దులు లేకుండ చూడాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. లక్ష్మీగూడ రాజీవ్ గృహ కల్ప కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, ప్రహరీగోడ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహ్మమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, నాయకులు అడికె జనార్ధన్, హనుమంత్ రెడ్డి, మాలతి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ జమ్ములమ్మ, పరశురాముడు స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల ( జాతర ) గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం)నడిగడ్డ ఇలవేల్పు జమ్మిచేడులోని శ్రీజమ్ములమ్మ పరుశరాముడు స్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 12 నుంచి ప్రారంభంకానున్నాయి ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలయ ఈఓ పురేందర్ ఆధ్వర్యంలో చైర్మన్ వెంకట్రాములు, ఆలయ కమిటి సభ్యులు గద్వాల ఎమ్మెల్యే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బ్రహ్మోత్సవాల గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ , వివిధ ప్రాంతాల నుండి విచ్చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తూ భక్తులు ఎలాంటి ఇబ్బందికి గురికాకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కలు చెల్లించుకునే విధంగా అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో పురేందర్ , ఆలయం కమిటీ డైరెక్టర్స్ , మాజీ ఎంపీపీ విజయ్ మాజీ జెడ్పిటిసి, రాజశేఖర్, నాయకులు రిటైర్డ్ టీచర్ కృష్ణయ్య సార్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను సీజ్ చేసిన పోలీసులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం)అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, ఒకరి పై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మల్దకల్ మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మల్దకల్ ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇటిక్యాల మండలం మొగిల్ రావు చెర్వు గ్రామానికి చెందిన శివరాజ్ అనే వ్యక్తి రేషన్ కార్డు లబ్దిదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని శనివారం తెల్లవారుజామున ఓ వాహనంలో తరలిస్తుండగా మల్దకల్ పోలీసులు పట్టుకున్నారు. సుమారు 15క్వింటాళ్ల బియ్యంతో పాటు బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు



## వైభవంగా ధ్వజారోహణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి1(ప్రభాత ఉదయం)భక్తుల కోరికలు, చింతలు తీర్చే కొంగు బంగారమైన శ్రీ పెద్ద చింతరేవుల శ్రీఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి. మొదటిరోజు శనివారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాలో భాగంగా శ్రీ ఆంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాల ప్రారంభరోజున పందిర్లకు అరుగులు వేయుటకు గాను పుట్టమన్ను కొరకు ఆలయం నుండి స్వామి వారిని పుట్ట దగ్గరకి పల్లకిలో తీసుకెళ్లి పుట్టమన్ను తీసుకవచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివార్ల ఆలయాల్లో హనుమద్ వ్రతం, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వారం రోజుల పాటు అంగరంగా వైభవంగా జరిగే ఈ వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల కోసం కర్ణాటకలోని రాయచూరు, మక్తల్, ఆత్మకూరుతో పాటు జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు జాతర సందర్భంగా స్వామికి దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించటం ఆనవాయితీగా వస్తోంది.

### లక్ష డప్పులు, వేల గొంతులు, కోట్లాది ప్రజలు కార్యక్రమంలో

# మాదిగ, మాదిగ ఉప కులాలతో పాటు ప్రజలందరూ పాల్గొనాలి

షాబాద్, ఫిబ్రవరి 1(ప్రభాత ఉదయం): రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశం కు ముఖ్య అతిథులుగా జాతీయ ఉపాధ్యక్షులు మాదిలేటి మాదిగ , రాష్ట్ర ఉపాధ్యక్షులు నియోజకవర్గం ఇంచార్జి క్యాసా రం శంకర్ రావు మాదిగ లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వేయి గొంతులు లక్ష డప్పులు కోట్లాది ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవడానికి మండలంలోని అన్ని గ్రామాలకు చైతన్యపరచుకొని డప్పులతో సహా రావాలన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాలు కుల సంఘాలు పాల్గొని ఫిబ్రవరి 5న మండల హెడ్ క్వార్టర్ నుండి భారీ ర్యాలీగా స్టార్ట్ అయ్యి సీతారాంపురం గ్రామం అంబేద్కర్ బొమ్మకు నివాళులర్పిస్తూ నాగర్ గూడ అంబేద్కర్ జగ్జీవన్ విగ్రహాల వద్ద రాలిని తీసుకొచ్చి అక్కడ సభను ఏర్పాటు చేసుకోవాలన్నారు . ఫిబ్రవరి 7న వేయి గొంతులు లక్షల డప్పులు కార్యక్రమానికి వెళ్లడానికి తగు సలహాలు సూచనలు వర్క్ డివిజన్ చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్స్ , కరపత్రాలు రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముక్కు విశ్వం మాదిగ, ఎం ఈ ఎఫ్ రాష్ట్ర నాయకులు దోసాడ నర్సింహ మాదిగ, జోగు అశోక్, రామకృష్ణ,శ్రీశైలం, వెంకట్, టీ.రామచందర్, మల్కీ.ప్రవీణ్,దర్శన్,కృష్ణ,సతీష్, హెచ్ రాములు .జి కృష్ణ. ఎం కృష్ణ. తదితరులు పాల్గొన్నారు



షాబాద్ మండలంలో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశం లో పాల్గొన్న నాయకులు

# కేంద్ర బడ్జెట్ లో మరోసారి తెలంగాణకు తీరని అన్యాయం

### వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 1(ప్రభాత ఉదయం) కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్ లో సామాన్య ప్రజలకు తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేంద్రంలో మూడోసారి బిజెపి ప్రభుత్వం అధికారం కట్టబెట్టిన సామాన్యుల కోసం కాకుండా సంపన్నుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టినట్లుందని తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం నుండి బిజెపి కి 8 మంది ఎంపీలు ఉన్న బడ్జెట్లో ప్రాతన్యత దక్కలేదు రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. తెలంగాణకు జరిగిన అన్యాయంపై బిజెపి ఎంపీలు గళమెత్తి తెలంగాణకు రావలసిన నిధులను రాబట్టాలని కోరుతున్నాను. బిజెపి ప్రభుత్వం వ్యాపారస్తుల ప్రభుత్వం నిరుద్యోగులు, రైతులు, పేదలను పట్టించుకోలేదు. ఇది బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇది బీహార్ బడ్జెట్ గా చెప్పుకోవచ్చు అని తెలియజేస్తున్నాను.తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను పట్టించుకోకుండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల గురించి మాట్లాడలేదు కేంద్ర బడ్జెట్లో తెలంగాణ ప్రస్తావనే లేదు. అదే ఏపీలో ఉండే పోలవరానికి బడ్జెట్లో రూ .5,936 కోట్లు కేటాయింపు చేశారు. తెలంగాణ నుంచి రూ 40 వేల కోట్లు జీఎస్టీ కేంద్రానికి వెళ్తున్నాయి. తెలంగాణకు పైసా కూడా ప్రత్యేక కేటాయింపులు జరగలేదని తెలియజేస్తున్నాను. ఎన్నికలు ఉంటేనే రాష్ట్రాలను పట్టించుకుంటామన్న వైఖరి సరికాదని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని వివక్ష చూపడం అన్యాయం తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు.





## శంషాబాద్ మెకానిక్ అసోసియేషన్ క్యాలండర్ ఆవిష్కరించిన ప్రకాష్ గౌడ్

శంషాబాద్, ఫిబ్రవరి 1( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండల్ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో తయారు చేసిన క్యాలెండర్ ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శని వారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో హైదరాబాద్. మేడ్చల్. మల్కాజ్గిరి. రంగారెడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్. వైస్ ప్రెసిడెంట్ జగన్ గౌడ్. జనరల్ సెక్రటరీ నరేందర్ యాదవ్. ట్రెజరర్ మైపాల్ రెడ్డి. శంషాబాద్ ప్రెసిడెంట్ కాసుల వెంకటేష్ గౌడ్. గౌరవ అధ్యక్షులు బొబ్బిలి ఉమామహేశ్వర్. వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ షఫిక్. ట్రెజరర్ విజయ్ కుమార్. జనరల్ సెక్రటరీ మహేందర్. జైన్ సెక్రెటరీ అజీమ్. జైన్ ట్రెజరర్ స్వామినాథ్. ముక్తార్. హైమద్ . దత్తు ముంతాజ్. సుధాకర్ సీనియర్ మెకానిక్స్ పాల్గొన్నారు.



## పాఠశాలను అప్ గ్రేట్ చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన అధికారులు

### మై హోమ్ సంస్థ నిర్మించిన పాఠశాల భవనం అద్భుతం

శంషాబాద్, ఫిబ్రవరి 1( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాల ముచ్చింతల్ పాఠశాలలో రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీరందర్ రావు శనివారం సందర్శించారు. పాఠశాలలో అపార్ ఐడి సంబంధించి ప్రగతిని తెలుస్కోవడం జరిగింది. విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెంపొందించే అంశం లో ఎఫ్ ఎల్ ఎన్, ఎల్ ఈ పి కార్యక్రమం ప్రగతిని పర్యవేక్షించారు. గ్రామంలో మై హోం సంస్థ జూపల్లి బాలమ్మ ఫౌండేషన్ ద్వారా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల ను పరిశీలించారు. ఆవరణలో సేంద్రియ ఎరువుల ద్వారా పెంచిన కిచెన్ గార్డెన్ ను పర్యవేక్షించారు. మైహోం సంస్థ ద్వారా విద్యార్థులకు బెల్ట్, ట్రై,షూస్. ఖుషి ఫౌండేషన్ ద్వారా స్పోర్ట్స్ డ్రెస్ . విద్యార్థులకు అందించారు. పాఠశాలలో ఏడవ తరగతి వరకు నిర్వహిస్తున్న తరగతులను పదవ తరగతి వరకు పెంచాలని ఆ గ్రామం మాజీ సర్పంచులు బీర్ల పెంటయ్య. వడ్డే సుజాత. మాజీ ఎంపీటీసీ వడ్డే చంద్రయ్య. మాజీ ఉపసర్పంచ్ గండు రాజు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్. మండల నోడల్ అధికారి, తొండుపల్లి కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు మధుకర్. పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు సుశీల బాయి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజకీయ, ఎన్నికల బడ్జెట్

### పేదలకు నిరాశ

### తెలంగాణకు మొండిచేయి:

### సీపీఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు



గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 1(ప్రభాత ఉదయం) కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సామాన్యులను , కష్టజీవులను పట్టించుకోలేదు, తెలంగాణ రాష్ట్రాన్నికూడా పట్టించుకోలేదు, గద్వాల్ జిల్లా రైల్వే ప్రాజెక్టులకు నిధులివ్వలేదు. వ్యాపారులకు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దేశ సమ్మిళిత అభివృద్ధి బడ్జెట్ కాదు.సీతారామన్ బీజేపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోడానికే ఈ బడ్జెట్. ఎన్నికలు ఉన్నరాష్ట్రాలకు , రాజకీయా అవసరాలు ఉన్న ప్రాంతాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణకు, గద్వాల జిల్లాకు మొండిచేయి చూపడం ఇక్కడి బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలి. ఇది ఆశల బడ్జెట్ సామాన్యులకు ఉపయోగం లేని బడ్జెట్ అని ఆయన ఆరోపించారు.

## పేదలకు దోహదపడే బడ్జెట్

### కొమ్ము భరత్ భూషణ్



కొత్తకోట, ఫిబ్రవరి 1(ప్రభాత ఉదయం) కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు, సామాన్యులకు ఊరట నిచ్చేదిగా ఉంది. వైద్య ఉపకరణాలకు భారీ తగ్గింపుల కారణంగా రోగులకు లాభం చేకూరనున్నది. 12 లక్షల ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు కారణంగా చిరు ఉద్యోగులకు, చిన్న వ్యాపారస్తులకు గొప్ప ఊరట.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608